05ATP06_05ATP06.qxd 06-02-2025 PM 11:02 Page 1



# జాతీయస్థాయి స్పీడ్ స్కేటింగ్‌లో తాడిపత్రి చిన్నారుల ప్రతిభ





జె.సి ప్రభాకర్‌రెడ్డిని కలిసిన చిన్నారులు

ట్రోఫీ సాధించిన చిన్నారులు

**తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**

తమిళనాడు రాష్ట్రం మధురైలో గత మూడు రోజులుగా జరిగిన జాతీయస్థాయి, స్పీడ్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీల్లో తాడిపత్రికి చెందిన టాలెంట్ స్కేటింగ్ అకాడమీ చిన్నారులు ప్రతిభ చూపి పతకాల పంట పండించారు. ఇందులో భాగంగా 8 మంది చిన్నారులు పలు విభాగాల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయిలో విజేతలుగా నిలిచి అంతర్జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఇందులో భాగంగా అండర్-14 విభాగంలో భార్గవ్, భానుఅఖిల్, అండర్-12 విభాగంలో షేక్ అస్రున్, షేక్‌హుస్సేన్ వలి, నాగ ఆదిత్య, అండర్-10 విభాగంలో రాధాకృష్ణ, అండర్-8 విభాగంలో దీపక్‌లు ప్రతిభ చూపారు. వారు గురువారం మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి తాము సాధించిన ట్రోఫీలను ఆయనకు చూపారు. ఈ సందర్భంగా జె.సి ప్రభాకర్‌రెడ్డి వారిని అభినందిస్తూ చదువుతో పాటు క్రీడాల్లోను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలుపుతూ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కోచ్ మధు పాల్గొన్నారు.

# సేంద్రీయ ఎరువులను ప్రోత్సహించాలి

**యాడికి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**



డంపింగ్‌యార్డులో వానపాములు వదులుతున్న ఎంపిడిఒ, తదితరులు

పంటల దిగుబడి కోసం సేంద్రీయ ఎరువులను ప్రతి రైతు వినియోగించాలని అందు కోసం తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని ఎంపిడిఒ వీర్రాజు తెలిపారు. గురువారం మండలంలోని రాయలచెరువు, తూట్రాళ్లపల్లి, తదితర గ్రామాల్లోని డంపింగ్‌యార్డుల్లో సేంద్రీయ ఎరువుల కోసం వానపాములను వదిలారు. ఈ సందర్భంగా సేంద్రీయ ఎరువుల వల్ల కలుగు ప్రయోజనాలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి శశికళ, మహేశ్వర్‌రెడ్డి, సర్పంచు తలారి అరుణానాగేష్, సచివాలయం సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

# బడ్జెట్ రైతులకు ఆశాభంగం కలిగించింది



కేంద్ర బడ్జెట్ ప్రతులను దగ్ధం చేస్తున్న దృశ్యం

**పుట్లూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**

కేంద్రం ప్రకటించిన బడ్జెట్ రైతులకు అశాభంగం కలిగించిందని కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వీటి రామాంజనేయులు పేర్కొన్నారు. ఇందుకు నిరసనగా కేంద్ర బడ్జెట్ ప్రతులను గురువారం మండల కేంద్రంలో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నవేళ, ఈ బడ్జెట్ మరింత డీ-రెగ్యులేషన్, లిబరలైజేషన్ ప్రోత్సహిస్తూ, బీమా రంగాన్ని వందశాతం ప్రైవేటీకరణ చేసే ప్రయత్నం చేస్తోందని వ్యవసాయం, తయారీ, సేవల రంగాలపై కార్పోరేట్ ప్రభావాన్ని పెంచే విధంగా ఈ బడ్జెట్ రూపొందించబడిందన్నారు. మద్దతు ధరల కోసం చట్టపరమైన హామీ లేకపోవడం అన్యాయమన్నారు. రైతుల న్యాయమైన డిమాండ్లు అయిన ఏళ్ల తరబడి పెండింగ్‌లో వున్న సి2జి50 కలిపి మద్దతు ధరలు ప్రకటించడం దానికి చట్టపరమైన హామీ ఈ బడ్జెట్‌లో లేదన్నారు. రైతులను దగా చేసిన బడ్జెట్ అని జగ్జిత్‌సింగ్ దల్లేవాలే ఆమరణ నిరాహారదీక్ష విరమణ సందర్భంగా ఇచ్చిన హామీలను కూడా తుంగలో తొక్కిందన్నారు. రైతు ఉద్యమ స్పూర్తితో భవిష్యత్తులో వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడానికి రైతుల రక్షణ కోసం ఉద్యమించాలని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పుట్లూరు మండల అధ్యక్షులు ఎన్.గోపాలకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి సత్తార్‌గోపాల్‌యాదవ్, మండల ఉపాధ్యక్షులు బి.చిన్నకృష్ణుడు, రైతు సంఘం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.చిన్నకుళ్లాయప్ప, మండల నాయకులు బాలనరసింహుడు, రైతులు అంజనప్ప, రామాంజనేయులు, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ ప్రజలు, ప్రజా ప్రతినిధుల సమక్షంలో నిర్వహించాలి




కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ డి.అంజినప్ప

**నంబులపూలకుంట, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**

నంబులపూలకుంట మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ ఈ నెల 15వ తేదిన నిర్వహించ వలసి ఉన్నందున ఆ కార్యక్రమం ప్రతి గ్రామ పంచాయితీలోప్రజలు, ప్రజా ప్రతినిధులు సమక్షంలో నిర్వహించాలని తెలియజేశారు. ప్రతి గ్రామంలోనూ అధికారులు ప్రజా ప్రతినిధులు కలియతిరిగి అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి క్లీన్ చేయాలి, అదే విధంగా స్వచ్ఛ భారత్ కార్మికులు ప్రతిరోజు ప్రతి ఇంటి నుంచి చెత్తను తడిచెత్త-పొడిచెత్తగా స్వీకరించి ఎస్‌డబ్ల్యూపిసి షెడ్లు దగ్గర వేరు చేసి తొట్టిలో వేయాలి, పొడి చెత్తను ప్రతి గురువారం అమ్మి గ్రామ పంచయాఇతీకి జమ చేయాలి, తడిచెత్తను ప్రోగు చేసి వర్మీకంపోస్టు తయారు చేయాలి అని తెలియజేశారు. ఈ కార్యక్రమం ప్రతి పంచాయితీలో ఫిబ్రవరి 15 నుంచి అమలు చేయాలని తెలుపడమైంది. ఈ కార్యక్రమం గురించి మండల స్థాయి అధికారులకు, సచివాలయం సిబ్బందికి వివరించడం జరిగింది. ప్రతి మూడవ శనివారం ప్రతి పంచాయితీకి కేటాయించిన ప్రత్యేక అధికారులు తప్పక హాజరై సచివాలయం సిబ్బంది, ప్రజా ప్రతినిధులు సహకారంతో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఇందులో ఎంపిడిఒ డి.అంజినప్ప, ఇఒఆర్‌డి మాధవరెడ్డి, ఎంఈఒ సుబ్బిరెడ్డి, ఎపిఎం వెంకటనారాయణ, ఏపిఒ చంద్రశేఖర్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# 9 మంది మట్కా బీటర్లు అరెస్ట్

- రూ.1.80 లక్షలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్‌పి రోహిత్‌కుమార్‌చౌదరి

**తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**



స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు, మట్కా పట్టీలు

తాడిపత్రి పట్టణం విజయనగర్ కాలనీలోని మట్కా కేంద్రంపై ఏఎస్‌పి రోహిత్‌కుమార్‌చౌదరి ఆధ్వర్యంలో గురువారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 9 మంది మట్కా నిర్వాహకులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 1.80 లక్షల రూపాయల నగదు, సెల్‌ఫోన్లు, మట్కా పట్టీలను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏఎస్‌పి మాట్లాడుతూ తాడిపత్రి ప్రాంతంలో ఎక్కడ అసాంఘికనకార్యకలాపాలు జరిగినా సంహించే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు. ఈ దాడుల్లో పట్టణ సిఐ సాయిప్రసాద్, పట్టణ ఎస్‌ఐ గౌస్‌బాష, సిబ్బంది పాల్గొన్నారు.

# సదృఢ దేశానికి విద్యార్థుల పాత్ర ఎంతో ముఖ్యం



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా

**బళ్లారి, ఫిబ్రవరి06, ప్రభాతవార్త**

పోటీ ప్రపంచంలో సదృఢ దేశ నిర్మాణానికి విద్యార్థుల పాత్ర అత్యంత ముఖ్యమైనదని బళ్లారి జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా పిలుపునిచ్చారు. విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఆవరణలో జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, జాతీయ సేవా యోజన విభాగం, ఉన్నతీ ఫౌండేషన్ బెంగళూరు, ఉద్యోగ, నైపుణ్యాభివృద్ధిశాఖ సిడాక్ దార్వాడల సంయుక్తాధ్వర్యంలో ఏర్పరిచిన పోటీ పరీక్షల విద్యార్థుల మంతన (దిశా-నిర్దేశం) కార్యక్రమాన్ని మొక్కకు నీరు పోయడం ద్వారా ప్రారంభించి మాట్లాడారు. తమ భవిష్యత్ రూపొందించుకునే శక్తి విద్యార్థుల చేతుల్లో ఉంది. సతత ప్రయత్నం, నాణ్యతతో కూడిన విద్యతో విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చునన్నారు. ఉన్నత స్థానమానాలతో కూడిన ఉద్యోగాలు పొందాలన్న ఆకాంక్ష గల విద్యార్థులు తమ కల సాకారం చేసుకునేందుకు పోటీ పరీక్షలు వేదికగా చేసుకుని, వాటిని ఎదుర్కొనడం ముఖ్య ఉద్దేశ్యంగా పెట్టుకోవాలని పిలుపునిచ్చారు. పోటీ పరీక్షల్లో ప్రిలిమ్స్, మెయిన్స్ ఇంటర్వ్యూలుగా మూడు దశలు ఉంటాయని, విద్యార్థులు స్వయంప్రేరణ, సాఫ్ట్ స్కిల్ డెవలప్‌మెంట్ అలవర్చుకుని విజయం సాధించాలని చెప్పారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ ఎం.మునిరాజు మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో క్రమశిక్షణ, సమయపాలన ముఖ్యంగా చేసుకుని ముందుకు నడవాలని, విద్యార్థులకు సృజన శీలత కోసం తగు శిక్షణ కల్పించి అభివృద్ధి పరచడం తమ లక్ష్యమని చెప్పారు. పోటీ పరీక్షలకు పాఠ్యాంశాల అధ్యయనంతోపాటు దినపత్రికలు చదివే అలవాటు పెంపొందించుకోవాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎస్.ఎన్.రుద్రేష్ ప్రారంభోపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో 300 మంది విద్యార్థులు పాల్గొని జిల్లాధికారితో ముఖాముఖీగా ప్రశ్నోత్తరాలు జరిపి సందేహాలను నివృతి చేసుకున్నారు. ఈ సందర్భంలో జిల్లా కౌసల్యాభివృద్ధి అధికారి ప్రాణేష్, జిల్లా పరిశ్రమల కేంద్రం జెడీ సోమశేఖర్, యూనివర్సిటీ వివిధ విభాగాల డీన్‌లు, ప్రొఫెసర్లు, పీజీ విద్యార్థులు, యూనివర్సిటీ బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# హెచ్‌ఎల్‌సీకి నీటి సరఫరా గడువు పెంచాలంటూ రైతుల ప్రతిఘటన



ఏడీసీ మహమ్మద్‌జుబేరాకు వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘాల నాయకులు

**బళ్లారి, ఫిబ్రవరి06, ప్రభాతవార్త**

హెచ్‌ఎల్‌సీ కాలువకు నీటి సరఫరాను 20 రోజులకు పెంచాలని డిమాండ్ చేస్తూ ఏఐకేకేఎంఎస్, కర్ణాటక రాష్ట్ర రైతు సంఘంకు చెందిన రైతులు డి.సి. కార్యాలయంలో ప్రతిఘటన చేపట్టారు. ఈ సందర్భంలో కర్ణాటక రాష్ట్ర రైతుసంఘం-హాసీరుసేన జిల్లాధ్యక్షుడు సంగనకల్ కృష్ణ, ఏఐకేకేఎంఎస్ రైతుసంఘం నాయకుడు గోవిండ్‌లు మాట్లాడుతూ బళ్లారి జిల్లాలో హెచ్‌ఎల్‌సీ కాలువ ఆయకట్టు భూముల్లో రైతులు వేసుకున్న జొన్న, మొక్కజొన్న, సజ్జ, అలసంద, మిరపతో పాటు ఇతర పంటలు చేతికొచ్చేందుకు కనీసం 20 రోజులు సమయం కావాలన్నారు. ఈ నేపథ్యంలో హెచ్‌ఎల్‌సీలో నీటి సరఫరాకు విధించిన గడువు సమీపిస్తుండడంతో టీబీ బోర్డు అధికారులు నీటి సరఫరాను బంద్ చేస్తే రైతులు పండించిన పంటలన్నీ ఎండిపోయే ప్రమాదం ఉన్నదని చెప్పారు. రైతుల పంటలను ఆదుకునేందుకు 20 రోజుల వరకు హెచ్‌ఎల్‌సీలో సాగునీటి సరఫరాను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లాధికారికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంలో ఏఐకేకేఎంఎస్ జిల్లా కార్యదర్శి గురల్లి రాజా, రైతులు ఈశ్వర్‌గౌడ, బసవరాజ్, గాదిలింగ, ఓంకార్, స్వామి, బసవరాజ్, తులసప్ప రైతులు పాల్గొన్నారు.

# సండూరు పీఎస్ఐను సస్పెండ్ చేయాలంటూ ధర్నా

**బళ్లారి, ఫిబ్రవరి06, ప్రభాతవార్త**

దళిత మహిళ పట్ల సండూరు పీఎస్ఐ వీరేష్ అనుచితంగా ప్రవర్తించిన చర్యను ఖండిస్తూ వివిధ జనపర సంఘ సంస్థలకు చెందిన పదాధికారులు సండూరు పోలీస్‌స్టేషన్ ఎదుట ప్రతిఘటన చేపట్టారు. ఈ మేరకు జిల్లా ఎస్పీకి రాసిన వినతి పత్రాన్ని సండూరు సీఐకు అందజేశారు. సండూరు సిటీ పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా ఉన్న వీరేష్ ఈనెల 1వ తేదీన సాయంత్రం 5 గంటలకు దేవదాసీ విమోచన సంస్థకు చెందిన నాయకురాలు హెచ్.దుర్గమ్మను పోలీస్‌స్టేషన్‌కు పిలిచి రాత్రి 8 గంటల వరకు విచారణ నెపంతో స్టేషన్‌లో ఉంచి అనుచితంగా ప్రవర్తించాడని, అసభ్య పదజాలంతో నిందించాడని ప్రదర్శనకారులు ఆరోపించారు. హెచ్.దుర్గమ్మ కర్నాటక రాష్ట్ర ప్రభుత్వ మహిలా అభివృద్ధి రంగంలో గణనీయ సేవలు అందించారని, గత రెండు దశాబ్దాలుగా మాజీ దేవదాసీ మహిళల, వారి పిల్లల అభివృద్ధికై శ్రమిస్తున్నారన్నారు. వారి పిల్లల విద్యాభ్యాసానికి ప్రభుత్వంచే సౌలభ్యాలను కల్పించేందుకు సంబంధిత సముదాయాల్లో జాగృతి కల్పిస్తున్నారని, ఆమె సేవలను గుర్తించి కర్ణాటక ప్రభుత్వం గౌరవించిందని, దేవదాసీ మహిళల విమోచన సంఘం సండూరు తాలూకా కార్యదర్శిగా ప్రస్తుతం ఉన్నారని, ఇంత గౌరవ మర్యాదలు కలిగిన దుర్గమ్మ పట్ల ఎస్ఐ వీరేష్ అనుచితంగా ప్రవర్తించి అవమానం చేశారని, ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంలో దేవదాసీ మహిళల విమోచన సంఘం కార్యదర్శి ఎ.స్వామి, మారెమ్మ, దుర్గమ్మ, జె.ఎం.చెన్నబసయ్య పాల్గొన్నారు.

# భద్రత.. బాధ్యత మర్చి పోవద్దు

- ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించాలి
- **ఆర్టిఓ శ్రీనివాసులు, వాల్మీకి విద్యా సంస్థల అధినేత పవన్‌కుమార్‌రెడ్డి**




సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టిఓ శ్రీనివాసులు,పవన్‌కుమార్‌రెడ్డి

**కదిరి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**

ప్రతి ఒక్కరు రహదారి భద్రత, బాధ్యత మరువ వద్దని కదిరి ఆర్టిఒ శ్రీనివాసులు వాల్మీకి విద్యా సంస్థల చైర్మన్ పాలవల పవన్‌కుమార్‌రెడ్డిలు సూచించారు. గురువారం వాల్మీకి విద్యా సంస్థల కార్యాలయ ఆవరణంలో ప్రైవేట్ పాఠశాలల డ్రైవర్లు, క్లీనర్లకు రహదారి భద్రత వారోత్సవాలపై సమావేశాన్ని రవాణా శాఖ, పోలీసుల సమన్వయంతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టిఒ శ్రీనివాసులు, పవన్‌కుమార్‌రెడ్డిలు మాట్లాడుతూ.. రహదారి ప్రమాదాల్లో ఎక్కువగా యువత ప్రాణాలు కోల్పోతున్నారని, ఒకరు చేసిన పనికి ఇతరులు శిక్ష అనుభవిస్తూ కుటుంబ సభ్యులకు వేధన మిగులు స్తున్నారన్నారు. మద్యం సేవించి వాహనం నడప వద్దు, రాష్‌డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ నేరమన్నారు. హెల్మెట్ ధారణతో ప్రాణానికి రక్షణ, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ.. వాహనాలు నడప వద్దని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు, రహదారి భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. రహదారి భద్రత నియమాలపై కుటుంబ సభ్యులకు, వీధిలో ఉన్నవారికి ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. అతివేగం అనర్థదాయకం, మితవేగం ఆనందదాయకమని వెల్లడించారు. ఈ కార్య క్రమంలో పట్టణ సిఐ డివి నారాయణరెడ్డి, ఆర్టిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు ఉచిత వైద్య శిభిరం

- రవాణా శాఖ అధికారి వర ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న రవాణా శాఖ అధికారి వరప్రసాద్

**కదిరి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**

రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా నేడు (శుక్రవారం) ఉదయం 10 గంటలకు స్థానిక రవాణా శాఖ కార్యాలయంలో ఎమ్మెల్యే కందికుంట సహకారంతో ఉచిత వైద్య మెగా శిభిరాన్ని నిర్వహిస్తున్నట్లు రవాణా శాఖ అధికారి వర ప్రసాద్ తెలిపారు. గురువారం రవాణా శాఖ అధికారి వర ప్రసాద్ విలేకర్లతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కందికుంట సహకారంతో కిమ్స్ సవేరా వైద్య శాల వారి సౌజన్యంతో పట్టణంలో వాహనదారులందరికీ హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నారన్నారు. ఈ వైద్య శిబిరంలో జనరల్ చెకప్, గుండె, కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# వైద్య శిబిరంలో అన్నదానం



భక్తులకు భోజనం వడ్డిస్తున్న సిఐ

**ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త**

శ్రీ సత్యసాయి బాబా సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొబైల్ ఉచిత వైద్య శిబిరంలో సత్యసాయి బాబా భక్తుడు వీరప్పగారిపల్లికి చెందిన ఇడగుట్ట ఆంజనేయులు అన్నదానం ఏర్పాటు చేశారు. మండలంలోని కొండకమర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మొబైల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నల్లమాడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరేంద్రారెడ్డి పాల్గొని బాబా చిత్రపటం వద్ద పూజలు నిర్వహించి బాబా భక్తులకు, పలు వ్యాధిగ్రస్తులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.... పలు రకాలు జబ్బుల బారిన పడిన వారికి వేళ కాస్త భోజనం అందిచడం అభినందనీయం అన్నారు. అన్నం పరబ్రహ్మ స్వరూపం అన్నారు. అన్ని దానాలలో కెల్లా అన్నదానం మహా పుణ్యం కార్యం అని భోజన వసతి ఏర్పాటు చేసిన దాత ఆంజనేయులు కుటుంబ సభ్యులకు ఆ బాబా దీవెనలతో పాటు ప్రజల ఆశీస్సులతో ఉంటాయన్నారు. దాత ఆంజనేయులు సిఐ నరేంద్రారెడ్డికి బాబాచిత్రపటంతో పాటు డైరీని బహుమతిగా అందచేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రైతు మీడియా కోఆర్డినేటర్ జాకీర్ అహ్మద్, ఐటిడిపి షానవాజ్, నాయకులు బాలక్రిష్ణారెడ్డి, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ డివిజన్ కార్యదర్శి మున్నా, రైతు సంఘం నాయకులు ఆకుతోట రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

- పట్టణ సిఐ డివి.నారాయణరెడ్డి




కౌన్సిలింగ్ ఇస్తున్న పట్టణ సిఐ

**కదిరి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**

చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని పట్టణ సిఐ డివి నారాయణరెడ్డి హెచ్చరించారు. గురువారం పట్టణ స్టేషన్‌లో మట్కా, గంజాయి, పేకాట పాత నేరస్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.. పాత నేరస్తులపై నిరంతరం నిఘా ఉంచామని, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే పట్టణ బహిష్కరణకు కూడా వెనుకాడబోమన్నారు. ప్రధానంగా మున్సిపల్ పరిధిలోని మగ్గాలకోట్రస్, రైల్వే స్టేషన్, బస్టాండ్, ఆర్ అండ్ బి బంగ్లా జూనియర్ కళాశాల మైదానం, డిగ్రీ కళాశాల మైదానం, నానాదర్గా సమీపంలోని మరికొన్ని ప్రదేశాల్లో కొంత మంది ఆకతాయిలు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించుట, ఇతర అసాంఘీక కార్యక్రమాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వారిపై ప్రత్యేక పోలీస్‌మొబైల్ టీంలను,డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేశామని, ప్రతిరోజు రాత్రిపూట 10 గంటల సమయం దాటిన తర్వాత ఎటువంటి కారణం లేకుండా బటయ తిరగరాదన్నారు. పదేపదే నేరాలకు పాల్పడితే రౌడీ షీట్లు కూడా ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. ఎక్కడైనా అసాంఘీక కార్యక్రమాలు నిర్వహించినట్లైతే 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని పట్టణప్రజలకు విజ్ఞప్తి చేశారు. సిఐతోపాటు ఎస్ఐ బాబ్‌జాన్ పాల్గొన్నారు.

# సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు గడువు పొడిగింపు

**యల్లనూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**



వాసుదేవరెడ్డి

ప్రభుత్వం అందచేస్తున్న సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తుల గడువును పొడిగించినట్లు ఇన్‌చార్జ్ ఎంపిడిఒ వాసుదేవరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒబిఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో ఈ నెల 12వతేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అధికారులు సబ్సిడీ రుణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.

# వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు శ్రీరామరక్ష

- కదిరి ఎంవిఐ వరప్రసాద్

**తలుపుల,పిభ్రవరి06,ప్రభాతవార్త**




మూడురోడ్ల కూడళి వద్ద ర్యాలీ దృశ్యం

ట్రాఫిక్ నిభందనలు వాహనదారులకు శ్రీరామరక్షని కదిరి ఎంవిఐ వరప్రసాద్ పేర్కొన్నారు. జాతీయ రోడ్డు రహదారి వారోత్సవాల్లో బాగంగా మండల కేంద్రంలోని శ్రీవాణి స్కూల్ నందు విధ్యా ర్థులకు డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమ, నిభందనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంవిఐ వరప్రసాద్ మాట్లాడుతూ వాహనదారులు ముఖ్యంగా హెల్మెట్ ధరించాలని, ద్విచక్ర వాహనాలల్లో ఇద్దరికి మించి ప్రయాణించరాదని సూచించారు.ఆటో డ్రైవర్లు ఆటోలలో పరిమితికి మించి ప్రయాణీకులు ఎక్కించరాదని తెలిపారు. అనంతరం బస్టాండు మూడురోడ్ల కూడళి వరకు ర్యాలీ నిర్వహించి పలవురికి రహదారి భద్రత నియమాల గురించి తెలియచేశారు.ఈ కార్యక్రమంలో శ్రీవాణి కరస్పాండెంట్ చంద్ర,డ్రైవర్ల యూనియన్ నాయకుడు ఎద్దులరాముడు, విధ్యార్థులు,డ్రైవర్లు, వాహనదారులు పాల్గొన్నారు.

# అధిక దిగుబడులపై రైతులకు శిక్షణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**నల్లమాడ ఫిబ్రవరి 06 ప్రభాతవార్త,**

మండల కేంద్రం నల్లమాడలో గురువారం ఫ్రంట్‌లైన్ డెమోస్ట్రేషన్ ఆన్ గ్రౌండ్ నెట్ ప్రోగ్రాం కింద రైతులు క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు సత్యనారాయణ, శాస్త్రవేత్తలు డాక్టర్ భాస్కర్‌రెడ్డి,రమేష్‌నాయక్,అనిత, సెంటర్ కో ఆర్డినేటర్ రామసుబ్బయ్య హాజరై శిక్షణ ఇచ్చారు. విత్తన సాగు నుంచి నూర్పిడి దశ వరకు రైతులు చేపట్టాల్సిన సాగు పద్దతులు, అధిక దిగుబడి సాధించడంలో రైతుల పాత్ర గురించి సూచనలు, సలహాలిచ్చారు. వేరుశనగ, కంది, వరి, మొక్కజొన్న తదితర పంటలకు సోకే చీడపీడలు, వాటి నివారణ, యాజమాన్య పద్దతులపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమలో వ్యవసాయాధికారి శంకర్‌నాయక్, ఎంపీఈఓ రాధ, రైతు సేవాకేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# నా భూమికి వెళ్లడానికి దారి కల్పించండి



వినతిపత్రం అందిస్తున్న తోపు పారేసు

**తనకల్లు, ఫిబ్రవరి 06 ప్రభాతవార్త**

మండల పరిధిలోని బొంతలపల్లి గ్రామంలో తోపు కిష్టప్ప పొలానికి దారి లేకుండా చేశారని తహాసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోపు కిష్టప్ప అను నాకు బొంతలపల్లి పొలం సర్వే నెంబర్ 510, ఒకటి ఏ.53 సెంట్లు రిజిస్టర్ భూమి కలదు, నేను ప్రతి సంవత్సరం పంట పెట్టుకొనుచున్నామన్నారు. కానీ నా పక్కన ఉన్న ఈడుగ సుబ్రమణ్యం మా భూమికి దారి లేకుండా మొత్తం ఫెన్సింగ్ వేశాడన్నారు. ప్రస్తుతం నా భూమిలోకి పోయేదానికి దారి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు. కాబట్టి తనకు న్యాయం చేసి తన భూమికి దారి ఇవ్వాల్సిందిగా స్థానిక తహాసీల్దార్‌ను కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిస్టు పార్టీ సెక్రటరీ తోపు కిష్టప్ప, చందప్ప, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ తోపు పారేశు, రమణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యక్రమాలపై కళాజాత బృందాలచే అవగాహన

**పుట్లూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**

ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 10వతేదీ నుండి గ్రామ పంచాయతీల్లో కళాజాత బృందాలచే అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఒ అలివేలమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న తడిచెత్త, పొడిచెత్త వేరుచేయడం, పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ వాడకం నిషేధము, హౌస్ ట్యాక్స్, పారిశుద్ధ్యం, మొక్కల పెంపకం, తాగునీటి వృధా అరికట్టడం, తదితర వాటి గురించి గ్రామ పంచాయతీల వారిగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా 10వతేదీన గరుగుచింతపల్లి, కోమటికుంట్ల, బాలాపురం, సి.వెంగన్నపల్లి, 11న శనగల గూడూరు. కొండేపల్లి, తక్కళ్లపల్లి, గాండ్లపాడు, 12న పుట్లూరు, కందికాపుల, కడవకల్లు, సూరేపల్లి, 13న అరకటవేముల, ఏ.కొండాపురం, దోసలేడు, చెర్లోపల్లి, 14న చాలవేముల, మడ్డిపల్లి, కుమ్మనమల, రంగరాజుకుంట, 15న మడుగుపల్లి, జంగమరెడ్డిపేట, వెల్లుట్ల గ్రామ పంచాయతీల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఒ తెలిపారు.

# బీసీ కార్పొరేషన్ లోన్ల దరఖాస్తు గడవు పొడిగింపు

రూరల్ మండల ఎంపీడీవో దివాకర్.

**అనంతపురం రూరల్, ఫిబ్రవరి 06 ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వ ఓ బి యమ్ యమ్ యస్ లబ్ధిదారులు దరఖాస్తు గడువును ఈనెల 12. వ తేదీ బుధవారం వరకు పొడిగించడం జరిగిందని రూరల్ మండలం ఎంపీడీవో దివాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురము జిల్లా మరియు శ్రీ సత్య సాయి జిల్లాలలోని ఎంపీడీఓలకు, మునిసిపల్ కమీషనర్లు కు, ఓ బి యమ్ యమ్ యస్ సంబంధించి మండలం, మునిసిపాలిటి లబ్ధిదారులు సబ్సిడీ రుణముల కొరకు దరఖాస్తు చేసుకొనుటకు ఈనెల 12. వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని ఈ విషయాన్ని మండలంలోని వివిధ బీసీ కులాలకు, అదేవిధంగా బలిజ కులం వారికి తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. వివిధ బీసీ కులాల తో పాటు బలిజ కులముల వారు కాపు కార్పొరేషన్ కింద దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

# అంధత్వ ఫించన్‌దారులు పరీక్షలు చేయించుకోవాలి

**యాడికి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**

అంధత్వము, వివిధ కంటి జబ్బులకు సంబంధించి వికలాంగత్వం సర్టిఫికెట్ పొంది ఫించన్ పొందుతున్న లబ్ధిదారులు ఈ నెల 11వతేదీన గుంతకల్లు ప్రభుత్వాసుపత్రిలో కంటి పరీక్షలకు తప్పకుండా హాజరు కావాలని గురువారం ఎంపిడిఒ వీర్రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 143 మంది అంధత్వ, కంటికి సంబంధించిన జబ్బులకు సర్టిఫికెట్లను పొంది ఫించన్లు తీసుకుంటున్నారు. అటువంటి వారు తప్పకుండా కంటి పరీక్షలకు హాజరు కావాల్సి వుంటుందని ఆయన తెలిపారు.

06ATP27_06ATP27.qxd 06-02-2025 PM 10:19 Page 1



## అమ్మాయిల చదువులు చైతన్యానికి, అభివృద్ధికి నిదర్శనం

**- సిడిపిఓ నాగమల్లేశ్వరి**

అగళి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త


సమావేశంలో మాట్లాడుతున్న సిడిపిఓ

అమ్మాయిలు చదివి చైతన్యవంతులు అయితేనే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని సిడిపిఓ నాగమల్లేశ్వరి అన్నారు. మండల పరిధిలోని పి.బ్యాడిగెర ఉన్నత పాఠశాలలో ఆర్డిటి, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మడకశిర ప్రాజెక్టు మహిళా శిశు అభివృద్ధి పథకాధికారిని (ఐసిడిఎస్) నాగమల్లేశ్వరి, ఇఓఆర్డి పద్మ, సీనియర్ సహాయకులు గుర్రన్న హాజరయ్యారు. సిడిపిఓ మాట్లాడుతూ.. మన జాతియ సంపద బాలలని వారిని కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వారి హక్కులతోపాటు బాధ్యతలను తెలుసుకోవాలన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు కావు, భవిష్యత్తులో ప్రతి ఒక్కరు అత్యున్నత స్థాయికి ఎదగాలని కోరారు. మండలంలో బాల్య వివాహాలు లేని మండలంగా తయారు చేయడానికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. అమ్మాయిలు అవకాశాలను అందిపుచ్చుకోవాలని, సమాజంలో ఎదురయ్యే సమస్యలపట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. చిన్న వయస్సుల్లో వివాహాలు చేయడం వల్ల అమ్మాయిలు మానసిక శారీక ఒత్తిడికి గురి కావడంతోపాటు ప్రసవ సమయంలో తల్లి బిడ్డ ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందన్నారు. అలాకాకుండా బాల్య వివాహాలు చేయాలని చూస్తే బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 ప్రకారం బాల్య వివాహాలు చేసుకున్న, నిర్వహించిన అందుకు సహకరించిన, హాజరైన ప్రతి ఒక్కరు శిక్షార్హులని తెలిపారు. ఇందుకుగాను రెండు సంవత్సరాలు జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా ఒక్కోసారి రెండు విధించడం జరుగుతుందన్నారు. బాల్య వివాహాలు చేయాలని ప్రయత్నం చేస్తుంటే వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్ 1098, 100కు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిటి మహిళా విభాగం టీం లీడర్ ఆదినారాయణ మాట్లాడుతూ.. ఆర్డిటి సంస్థ బాలల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వ శాఖలతో సమన్వయంతో ముందస్తు చర్యగా అన్ని ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసి పిల్లలకు, తల్లిదండ్రులకు ప్రస్తుత సమాజంలో పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల అవగాహన కల్పిస్తామని తెలిపారు. ప్రతి అమ్మాయి లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిటి మహిళా అభివృద్ధి విభాగం టీం లీడర్ ఆదినారాయణ, ప్రధానోపాధ్యులు యోగేశ్వరుడు, ఉపాధ్యాయులు ఆరాధ్య, నబి రసూల్, శ్రీదేవి, గోపాల్, విఆర్ఓ కుమారి, వెల్ఫేర్ అసిస్టెంట్, వైద్య సిబ్బంది, ఆర్డిటి కౌన్సిలర్ నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీ నెరవేర్చాలని వైఎస్ఆర్‌సిపి నేతల డిమాండ్

**- ర్యాలీగా వెళ్లి తహశీల్దారు కార్యాలయం ముందు నిరసన**

అగళి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త


నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు

తెలుగుదేశం పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్న డిమాండ్‌తో వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమాన్ని వ్యక్తం చేశారు. అగళి బస్టాండ్ ప్రాంతం నుంచి ర్యాలీగా వెళ్లి తహశీల్దారు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చి హామీలను నెరవేర్చడం లేదని సమన్వయ కర్త ఈరలక్కప్ప అన్నారు. సూపర్ సిక్స్ అమలు చేయాలని, హంద్రీనీవా కాలువను వెడల్పు చేయాలని, మడకశిర బైపాస్ కెనాల్‌ను 1500 క్యూసెక్కుల సామర్థ్యంతో నిర్మాణాలు చేపట్టాలని, రైతులకు నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలని, లో ఓల్టేజీ సమస్య తీర్చాలని, అగళి మండలానికి 132 కెవి సబ్ స్టేషన్‌ను నిర్మించాలని తదితర డిమాండ్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఆనంద్ రంగారెడ్డి, వైఎస్ఆర్‌సిపి వక్కలిగ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రంగేగౌడ్, వైఎస్ఆర్‌సిపి జిల్లా అధ్యక్షులు నరసింహమూర్తి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీలు, మడకశిర ఎంపిపి సత్యనారాయణ, రొళ్ల ఎంపిపి విజయరంగేగౌడ్, మడకశిర కన్వీనర్ రామిరెడ్డి, రొళ్ల కన్వీనర్ నరసింహారెడ్డి, సత్యనారాయణ, అగళి మండల కన్వీనర్ శ్రీనివాస్, సచివాలయాల కన్వీనర్ మహేంద్ర, సూర్యనారాయణరెడ్డి, నారాయణ, లక్ష్మీపతి, మంజునాథ్, సతీష్, నజీర్, శ్రీనివాస్, తదితరులు హాజరయ్యారు.

## పేద వారిని ఆదుకోవడమే ఇస్లాం సారాంశం..

**ఇతర మతాలను గౌరవించాలి ..పరాయి స్త్రీలను సోదరి మణులుగా భావించాలి**

పెనుకొండ,జనవరి 6 ప్రభాతవార్త


సదస్సులో ప్రసంగిస్తున్న ముస్లిం మత పెద్దలు

నిస్వార్థమైన జీవితమే అల్లాకు అత్యంత ఇష్టమని ముస్లిం పెద్దలు స్పష్టం చేశారు. పట్టణంలో రెండు రోజులపాటు ఇస్తే మా సదస్సు నిర్వహించబడింది. గురువారం ముగింపు సదస్సులో పలువురు ముస్లిం పెద్దలు ప్రసంగించారు. ఎదుటి వారిని గౌరవించి, నిస్వార్థంగ జీవించడమే మానవ నైజమని, తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలన్నారు. ముస్లిం మత పెద్దలు ఇస్లాం యొక్క పవిత్రతను వివరించారు, ముస్లింలకు ఖురాన్, హిందువులకు భగవద్గీత, క్రిష్టియన్ లకు బైబుల్ ఎంతో పవిత్రమైనవని, ఏ గ్రంథం తీసుకున్న దానిలో సారాంశం ఒక్కటే అన్నారు, ప్రపంచంలో ఏ జీవికి లేని వరం మానవుడికి అల్లా ఇచ్చాడని, ప్రపంచంలో ఏ జీవరాసికి లేని మాటలు మానవుడికి అల్లా ఇచ్చాడన్నారు. ఐదు పూటలా నమాజ్ చదివి, మనస్ఫూర్తిగ దూవా చేస్తే ఆ అల్లా సకల రోగాలు నయం చేసి, మనశాంతి, ఆరోగ్యం, ఐశ్వర్యం, అంతస్థులు ఇస్తాడని, సమాజంలో ప్రతి ఒక్కరు నీతినిజాయితిగ బ్రతకాలన్నారు. మనం అనునిత్యం మన కుటుంబం కోసం అహర్నిషలు కష్టపడి పని చేయాలని, మనం సంపాదించే ప్రతి రూపాయి కష్టార్జితమై ఉండాలని, ఎవరిని మోసంచేసి సంపాదన చేయకూడదని, అలా మోసంచేసి సంపాదిస్తే అల్లాకు ప్రతిపైసాకూడా లెక్క చెప్పాలన్నారు, కోపం, ఆవేశం, ఆనందం, సంతోషం, బాధ, కష్టాలు, సుఖాలు అన్ని భరించే వాడే నిజమైన మనిషి అని, ప్రతి ముస్లిం తన అక్కా, చెల్లెళ్ళను ఎంతగా ప్రేమిస్తాడో, అదే విధంగ ఎదుటి స్త్రీని ఓ అక్కగా, ఓ చెల్లిగ చూడాలన్నారు, అదే విధంగా ప్రతి రోజు ఐదు పూటలా నమాజ్ తో పాటు ఏంతో ప్రాముఖ్యమైన సున్నత్, వాజిబ్ నమాజ్ చదవాలని, తెహతూల్ వజూ చేయాలని, వజూ చేసాకా నమాజ్ ఎలా చేయాలని క్షుణ్ణంగా వివరించారు. ప్రతి సంవత్సరం రంజాన్ లో మనం దాణం చేసే ప్రతి రూపాయికి 70 రెట్లు పుణ్యం వస్తుందని, రంజాన్ మాసం మొత్తం భక్తి శ్రద్ధలతో ఆ అల్లాహ్‌ను తలుచుకుని చేసే ప్రతి కార్యంలోను అల్లాహ్ తోడుంటాడని, రంజాన్ పండగ పూట మన ఇంటి పరిశరాల్లో గాని పేదవారికి గాని బట్టలు, డబ్బు దానం చేయాలని పిలుపునిచ్చారు, ఈ దీనీ ఇస్తెమా లో ఆంధ్రప్రదేశ్ నుండేకాక కర్నాటక ఇతర రాష్ట్రాల నుండి భారీ ఎత్తున ముస్లిం సోదరులు పాల్గొన్నారు, ఈ ఇస్తెమా కు వచ్చే ముస్లిం సోదరుల కోసం నగర పంచాయితీ కమిషనర్ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టగా, డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలోపోలీస్ లు గట్టి బందోబస్థు నిర్వహించారు, దీనీ ఇస్తెమాకు వచ్చిన ముస్లిం సోదరుల కోసం వజూ ఖానాలు, భోజన కౌంటర్లను నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు.

## వీళ్ళకు ఎవరు దిక్కులేరయ్యా.... మీరే దిక్కు ఆదుకోండయ్యా

**మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి,ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి వద్ద రోదించిన మృతుడు దస్తగిరి కుటుంబ సభ్యులు**

కొత్తచెరువు ఫిబ్రవరి 06 ప్రభాతవార్త.


మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్పుతున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి, దృశ్యం

ఈ కుటుంబానికి ఎవరు దిక్కు లేరయ్య మీరే దారి చూపండయ్యా అని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి వద్ద మృతుడు దస్తగిరి కుటుంబ సభ్యులు ఆదినారాయణ మ్మ కుమారులు సతీష్ ,హర్ష లను దగ్గరకు తీసుకొని రోదించారు. దస్తగిరి కొద్దిరోజులుగా నా ఆరోగ్యంతో బాధ పడుతూ బుధవారం గుండెపోటుతో మృతి చెందడంతో ఈ సమాచారాన్ని తెలుసుకున్న మాజీ మంత్రి తోపాటు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి గురువారం హుటాహుటిన బైరాపురం గ్రామానికి విచ్చేసి ఆ కుటుంబాన్ని పరామర్శించారు. తీవ్ర విషాదంలో ఉన్న ఆ కుటుంబ సభ్యులను వారు ఓదార్చారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇస్తూ కొంత ఆర్థిక సహాయాన్ని అందజేశారు. భవిష్యత్తులో పార్టీ అండగా ఉంటుందని అలాగే తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని వారికి హామీ ఇచ్చారు. అన్ని విధాలుగా ఆ కుటుంబానికి సహాయ సహకారాలు అందించి ఆదుకుంటామని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. క్యాన్సర్ వ్యాధితో మృతి చెందిన శంకర్ కుటుంబాన్ని పరామర్శ అదే గ్రామంలో క్యాన్సర్ వ్యాధితో గత కొన్ని రోజులు క్రితం మృతి చెందిన శంకర్ కుటుంబాన్ని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి,ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పరామర్శించారు. మృతుడు శంకర్ సతీమణి రాధ కు ధైర్యం చెప్పి ఓదార్చారు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఆమెకు కొంత ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పార్టీపరంగా ఆ కుటుంబానికి భవిష్యత్తులో సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో బైరాపురం సర్పంచ్ రవి కుమార్ ,టీడీపీ పట్టణ కన్వీనర్ శ్రీనివాసులు సింగల్ విండో ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ ,శంకర పాల్గొన్నారు.

## దేశ ప్రజలు గర్వించదగ్గ బడ్జెట్ ప్రవేశపెట్టిన ప్రధాని మోడీకి ధన్యవాదాలు



ప్రధాని నరేంద్ర మోది గారికి ధన్యవాదాలు తెలుపుతున్న దృశ్యం

తాడిమర్రి ఫిబ్రవరి 6(ప్రభాతవార్త)

దేశ ప్రజలు గర్వించదగ్గ 2025 2026 బడ్జెట్ ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వానికి ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ గారికి ధన్యవాదాలు తెలియజేస్తూ బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ మెట్ట వంశీకృష్ణ గారు జిల్లా బిజెపి అధ్యక్షుడు జిఎం శేఖర్ గారి సూచన మేరకు బీజేవైఎం ఆధ్వర్యంలో తాడిమర్రి మండలం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విద్యార్థులు మరియు యువతతో కలసి పోస్ట్ కార్డులు పంపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు బీజేవైఎం జిల్లా కార్యదర్శి బిల్లు కుల్లాయప్ప యాదవ్ తాడిమర్రి బిజెపి మండల కన్వీనర్ రాము హాజరై మాట్లాడుతూ పేద మధ్యతరగతి కుటుంబాలకు 2025 బడ్జెట్ ఎంతో లబ్ధి చేకూర్చే విధంగా ఉందని పేర్కొన్నారు మధ్యతరగతి కుటుంబ ప్రజలకు 12 లక్షల రూపాయల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం ఎంతో ఊరట నచ్చింది అన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్ ను హర్షిస్తూ ప్రధాని నరేంద్రమోదికి ధన్యవాదాలు



పోస్ట్ కార్డు ద్వారా ప్రధానికి ధన్యవాదాలు తెలుపుతున్న దృశ్యం

బత్తలపల్లి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025 బడ్జెట్ దేశ ప్రజలు గర్వించ దగ్గ బడ్జెట్ను ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రభుత్వానికి బీజేవైఎం ఆధ్వర్యంలో పోస్ట్ కార్డుల ద్వారా ధన్యవాదాలు తెలిపారు. గురువారం మండల కేంద్రమైన బత్తలపల్లిలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు మిట్టా వంశీకృష్ణ, జిల్లా బిజెపి అధ్యక్షుడు జిఎమ్.శేఖర్ సూచనలతో బీజేవైఎం ఆధ్వర్యంలో మండల బిజెపి నాయకులు పోస్ట్ కార్డులు ద్వారా హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెవైఎం నాయకులు జడ్పిటిసి కోటి సుధా, బీజేవైఎం జిల్లా కార్యదర్శి బిల్లు కుళ్లాయప్పయాదవ్, బిజెపి మండలఅధ్యక్షులు ఆకులేటిభాస్కర్, మాజీమండలకన్వీనర్ వీరనారప్ప, కావేటిమల్లికార్జున, వడ్డేతిరుపతయ్య, లింగారెడ్డిపల్లి బొంతల ఉజ్జినప్ప, ముసుగు రామచంద్ర, సాకే గోపాల్, కొండ, ఆకులేటి తరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ పేద మధ్యతరగతి కుటుంబాలకు 2025వ బడ్జెట్ లబ్ధి చేకూర్చే విధంగా ఉందన్నారు. మధ్యతరగతి కుటుంబ ప్రజలకు 12 లక్షల రూపాయల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం ఊరటనిచ్చిందన్నారు. మహిళలు రైతులు అన్ని వర్గాల ప్రజలకు మంచిని చేకూర్చే విధంగా బడ్జెట్ను అందించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి బీజేవైఎం ఆధ్వర్యంలో యువతతో కలిసి ప్రత్యేకంగా పోస్ట్ కార్డుల ద్వారా ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

## సమ్మర్ క్రాస్ ప్రోగ్రాంతో తాగునీటి సమస్యలకు పరిష్కారం

కనగానపల్లి ఫిబ్రవరి 6 ప్రభాతవార్త


ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం నందు గురువారం సమ్మర్ క్రాస్ 20 25 కార్యక్రమాన్ని ఆర్డబ్ల్యూఎస్ ధర్మవరం డీఈఈ శాంతన్న ఆధ్వర్యంలో ఎంపీడీవో అనిల్ కుమార్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈఈ బాబా ఫక్రోద్దీన్‌ల అధ్యక్షతన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా అలాగే శానిటేషన్ పనులు జరిగే విధంగా ముందస్తు ప్రణాళికగా సమ్మర్ క్రాస్ 2025 కార్యక్రమాన్ని ప్రారంభించారని కార్యక్రమంలో భాగంగా మర మత్తుకు గురైన చేతిపంపులను రిపేర్ చేయనున్నట్లు వారు తెలిపారు. అలాగే మరమ్మతుకు గురైన చేతిపంపులను రిపేరు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ మండల కోఆర్డినేటర్ తిరుపాలు టి ఏ లు రవిచంద్ర, మాదప్ప, బీఎఫ్ టి నారాయణస్వామి ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## కన్నులపండువగా శ్రీభద్రావతి భావనా రూషీంద్రుల కల్యాణోత్సవాలు


గోపూజ నిర్వహిస్తున్న దృశ్యం

ధర్మవరం, ఫిబ్రవరి 6,ప్రభాతవార్త

శ్రీభద్రావతి భావనా రూషీంద్రుల కల్యాణ మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి, పట్టణంలోని శ్రీపద్మశాలీయ బహుమత్తమ సంఘం ఆధ్వర్యంలో భద్రావతి భావనా రుషీంద్రుల కల్యాణ మహోత్సవాలను అర్చకులు అంగరంగవైభవంగా నిర్వహించారు. ఉదయం 6గం టలకు గోపూజ, మహాగణపతిపూజ, స్వస్తిపుణ్యాహవాచనం, పంచగమ్య ప్రాశన, ఋత్విగరణం, కార్యకర్తలకు కంకణధారణ, అదిత్యాది నవగ్రహ సహిత కలశస్థాపన, అగ్నిప్రతిష్ట సాయందీక్షాహోమం, మహాగణపతిహోమం అనంతరం మహామం గళహారతినిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్యభద్రావతి భావనా రుషీంద్రులకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 9గంటలకు బిందెసేవ(గం గపూజ) నిర్వహించడంతోపాటు స్వామి వారికి పంచామృతాభిషేకం, అంకురార్పణ, అష్టోత్తరం, లక్ష్మీనారాయణ హోమం చేపట్టారు. సాయంత్రం ధ్వజారోహణ కార్యక్రమాన్ని కూడా వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. శుక్రవారం ఉదయం భద్రావతి భవనా రుషీంద్రురల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నామని ఆ సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు పుత్తారుద్రయ్య, జింకా నాగభూషణలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం ప్రధానకార్యదర్శి మెటికల బాలకుళ్లాయప్ప, కోవాదికారివడుకుల భాస్కర్, సహాయ కార్యదర్శులు పోలంకి వెంకటరామయ్య, పోలంకి లక్ష్మీనారాయణ, బుదారపు శ్రీనివాసులు, గుర్రంలక్ష్మీనారాయణ, గుర్రంగంగాధర్, ఊట్ల నరేంద్ర, జింకాగోవిందు, మారా పురుసక్షత్న, సేపూరి ప్రకాశ్, జానపాటి మోహన్, కనమాగటి చంద్రశేఖర్, యాదవయెఎఉ. నల్లగుండ్ల మార్కొండేయ, ఆర్వేటి ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

## కనబడకుండా పోయిన 10వ తరగతి విద్యార్థి

ఉరవకొండ, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త


కనబడకుండా పోయిన 10వ తరగతి విద్యార్థి చంద్రశేఖర్

మండల పరిధిలోని ఆమిద్యాల గ్రామానికి చెందిన 10వ తరగతి చదువుతున్న గొల్ల చంద్రశేఖర్ అనే విద్యార్థి గత 3 రోజుల నుండి కనబడకుండా పోయాడు. గ్రామానికి చెందిన గొల్ల చిన్న ఎర్రిస్వామి, సువర్ణమ్మ దంపతుల కొడుకైన చంద్రశేఖర్ తల్లిదండ్రులు మందలించారని ఈనెల 4వ తేదీ మంగళవారం ఇంటి నుండి వెళ్లిపోయాడని సమాచారం. కొడుకు ఆచూకీ కోసం తల్లిదండ్రులు విస్తృతంగా గాలిస్తూ పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిసింది. ఎవరికైనా బాలుడి ఆచూకీ తెలిస్తే సెల్ నంబర్ 96033 12851కు సమాచారం ఇవ్వాలని కుటుంబ సభ్యులు తెలిపారు.

## ప్రధానోపాధ్యాయుడు మృతి

గుత్తి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త


మృతి చెందిన సత్యనారాయణ

గుత్తిఆర్ఎస్‌లోని నెంబర్-1 ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ గురువారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తన స్వగృహంలో మృతి చెందారు. మృతునికి భార్య ఇద్దరు సంతానం వున్నారు. ఆయన మృతి పట్ల మండల విద్యాధికారి రవినాయక్, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

## ఘనంగా తొండపాడు శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

గుత్తి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త


బ్రహ్మోత్సవాల కళ్యాణ పత్రికలను విడుదల చేస్తున్న దృశ్యం

మండలంలోని తొండపాడు శ్రీబొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారి బ్రహ్మోత్సవాల కళ్యాణ పత్రికలను టిడిపి గుత్తి ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను జక్కలచెరువు గ్రామం నుండి ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఉత్సవాలల్లో భాగంగా గురువారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 12న కళ్యాణోత్సవం, రథోత్సవం జరగనున్నాయి. 14వతేదీ వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయి. పెద్దఎత్తున పలు రాష్ట్రాల నుండి భక్తులు హాజరవుతున్న దృష్ట్యా తగు ఏర్పాట్లను చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ రామాంజనేయులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కమిటీలో పలు సామాజిక వర్గాలకు చోటు

గుంతకల్లు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పలు సామాజిక వర్గాలకు చోటు కల్పించారు. ఎస్‌సి సామాజిక వర్గం నుండి చికెన్ జగన్ సతీమణి జీవిత, సంచారజాతుల నుండి ఇందిరాదేవి, కాపు సామాజికవర్గం నుండి రాయల్ వెంకటేష్, కమ్మ సామాజికవర్గం నుండి యుగంధర్, డాక్టర్ రామ్మూర్తి, వైశ్యుల నుండి డాక్టర్ పవన్‌కుమార్‌లను ఎంపిక చేశారు. దీంతో వారు ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధికి తమ సలహాలు సూచనలు అందచేస్తామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా అభివృద్ధి కమిటీ ఎంపికపై టిడిపికి చెందిన పలువురు అసంతృప్తి వ్యక్తం చేయం గమనార్హం.

## చౌకధాన్యపు దుకాణాన్ని తనిఖీ చేసిన విజలెన్స్ అధికారులు

గుత్తి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త


చౌకధాన్యపు డిపోను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని గుత్తిఆర్ఎస్‌లో వున్న చౌకధాన్యపు దుకాణాన్ని గురువారం విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పుస్తక, భౌతిక నిల్వల్లో వ్యత్యాసాలు వున్నట్లు గుర్తించారు. ఈ మేరకు 6ఏ కేసు నమోదు చేసి స్థానిక రెవెన్యూ అధాకారులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో సిఐ శ్రీనివాసులు, ఏఎ వాసుప్రకాష్, సిఎస్‌డిటి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఆమిద్యాల గ్రామంలో బయటపడ్డ తూకాల్లో భారీ మోసం..!

**-పప్పుశెనగ కొనగోళ్లలో మోసాన్ని గమనించి ఎదురుతిరిగిన పలువురు రైతులు -కాటా యంత్రాల్లో క్వింటాల్ పేరుతో 112 కేజీల లాక్కొంటున్న వ్యాపారులు -వ్యాపారులు స్థానికులే కావడంతో గ్రామంలో సున్నితంగా మారిన వ్యవహారం**


లారీలో పప్పుశెనగను తరలిస్తున్న దృశ్యం

ఉరవకొండ, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త



మాట్లాడుతున్న బాధిత రైతులు

ఉరవకొండ మండల పరిధిలోని ఆమిద్యాల గ్రామంలో పప్పుశెనగ కొనగోళ్లలో తూకాల్లో మోసం బయటపడింది. గ్రామానికి చెందిన కొందరు వ్యాపారులు క్వింటాల్ పప్పుశెనగకు 5,800 రూపాయల ధర నిర్ణయించి కొనగోలు చేస్తున్నారు. గురువారం పంట కొనగోలు సమయంలో కొందరు రైతులు స్కేల్ కాటా యంత్రం ద్వారా జరుగుతున్న తూకాల్లో మోసాన్ని పసిగట్టి వ్యాపారులను నిలదీశారు. సాధారణంగా వ్యాపారులు 100 కేజీలకు గోనె సంచుల బరువు, తదితర కారణాలు చెబుతూ 6 కేజీలను అదనంగా తీసుకోవడం జరుగుతూ వస్తోంది. అయితే కాటా యంత్రంలో స్కేల్‌ను తమకు అనుకూలంగా ఏర్పాటు చేయించుకున్న స్థానిక వ్యాపారులు కొందరు ఏకంగా క్వింటాల్‌కు 12 కేజీలు అదనంగా దోచుకొంటుండటం బట్టబయలైంది. దీంతో వ్యాపారులపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. మా శ్రమను తూకాల్లో మోసంతో దోచుకొంటున్నారని రైతులు మండిపడినట్లు తెలిసింది. ఈ విషయమై కొందరు రైతులు పోలీసులకు పిర్యాదు చేయాలని ఆలోచిస్తున్నట్లు తెలియవచ్చింది. ఇదిలా ఉండగా గత ఏడాది డిసెంబర్ 19న వజ్రకరూరు మండలం చాబాల గ్రామంలో కందుల కొనగోళ్లలో తూకాల్లో జరిగిన భారీ మోసం రైతుల అప్రమత్తతతో బయటపడిన విషయం తెలిసిందే. కొందరు వ్యాపారులు ఎలక్ట్రానిక్ కాటా యంత్రంలో ఏకంగా రిమోట్‌తో నడిచే చిప్‌ను ఏర్పాటు చేసుకొని క్వింటాల్‌కు అదనంగా 24 కేజీలు దోచుకున్న వ్యవహారం బయటపడగా తూనికలు కొలతలశాఖ అధికారులు వ్యాపారులపై కేసు నమోదు చేశారు. ఈ మోసం వెలుగు చూసిన కేవలం నెలన్నర రోజుల వ్యవధిలోనే అలాంటి తరహా మోసమే ఆమిద్యాలలో వెలుగులోకి వచ్చింది. తూనికలు కొలతలశాఖ అధికారులు మోసాలు జరిగిపోయిన తరువాత వెళ్లి హంగామా చేసి కేసులు నమోదుచేసి అపరాధ రుసుం వసూళుచేసి చేతులు దులుపుకోవడం మానుకొని ప్రస్తుతం గ్రామాల్లో అధికంగా జరుగుతున్న కందులు, పప్పుశెనగ కొనగోళ్లపై ప్రత్యేక నిఘా పెట్టి వ్యాపారులు మోసాలకు పాల్పడకుండా గట్టి చర్యలు చేపట్టాల్సి ఉంది. క్వార్టర్స్ 1: శిధిలమైన పంచాయతీ క్వార్టర్స్‌ను కూల్చివేసిన దృశ్యం

## వేగంగా జరుగుతున్న పంచాయతీ క్వార్టర్స్ కూల్చివేతలు..!

**-ఒకవైపు కూల్చివేతలు మొదలైనా ఖాళీ చేయని మరికొందరు**

**-కూరగాయాల మార్కెట్ ఏర్పాటుకు వడివడిగా అడుగులు**


కూల్చి వేయాల్సివున్న క్వార్టర్స్

ఉరవకొండ, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

ఉరవకొండ పట్టణంలోని లత్తవరం రోడ్డులోగల మేజర్ గ్రామ పంచాయతీకు చెందిన శిధిలావస్థలోవున్న సిబ్బంది క్వార్టర్స్ కూల్చివేతలు వేగంగా కొనసాగుతున్నాయి. ఇక్కడ కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయాలని ఇదివరకే మేజర్ గ్రామ పంచాయతీ తీర్మానించిన విషయం తెలిసిందే. ఇటీవల ఈ వ్యవహారం మళ్లీ తెరమీదకు రాగా రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ స్పందించి త్వరితగతిన కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిను ఆదేశించారు. ఈ క్రమంలోనే నాలుగైదు రోజులుగా ప్రస్తుతం ఖాళీ అయిన మూడు క్వార్టర్స్‌ను కూల్చివేశారు. మరో 7 క్వార్టర్స్‌తోపాటు గెస్ట్‌హౌస్‌ను కూల్చివేయాల్సి ఉండగా అందులో నేటికీ కొందరు కాపురముంటుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పంచాయతీ సిబ్బంది కోసం నిర్మించిన క్వార్టర్స్‌లో పలుకుబడి కల్గిన, రాజకీయ పార్టీలకు చెందిన కొందరు పాగావేసి పదుల సంవత్సరాలుగా కాపురాలు కొనసాగిస్తూ వస్తున్న విషయం తెలిసిందే. క్వార్టర్స్‌ను ఖాళీ చేయాలని అధికారులు ఎన్నిమార్లు నోటీసులిచ్చినా పట్టించుకోకుండా అక్కడే కాపురముంటుండటంతో కూరగాయల మార్కెట్ ఏర్పాటు ఆలస్యమవుతూ వచ్చింది. ఈ క్రమంలోనే ఖాళీ అయిన క్వార్టర్స్ కూల్చివేతలు ప్రారంభించిన పంచాయతీ క్వార్టర్స్‌లో కాపురముంటున్న వారికి వారం రోజుల్లో ఖాళీ చేయాలని మరోమారు నోటీసులిచ్చింది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్‌ను 'ప్రభాతవార్త' సంప్రదించగా ఆయన మాట్లాడుతూ అందరూ క్వార్టర్స్ ఖాళీ చేస్తే భవనాలన్నింటినీ కూల్చివేసి కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

## గోరంట్ల బిజెపి కార్యాలయంలో మండల కార్యకర్తల సమావేశం

**- మండల అధ్యక్షులు బోయ లక్ష్మీనారాయణ అధ్యక్షతన మీటింగ్**

గోరంట్ల, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

గోరంట్ల పట్టణంలోని భారతీయ జనతాపార్టీ కార్యాలయంలో గురువారం బిజెపి జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్ నాయకత్వంలో మండల కమిటీ సమావేశాన్ని మండల అధ్యక్షులు బోయ లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో మండల కమిటీ విషయమై సీనియర్ నాయకులు చర్చించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శంకర్‌రెడ్డి, గంగంపల్లి గంగాధర్, వెంకటాచలం, నాగరాజ్‌యాదవ్, వడల చంద్రరెడ్డి, భజంత్రీ శంకర, వానవోలు బాలు, లక్ష్మీనరసమ్మ, ముంతాజమ్మ, లక్ష్మీదేవి, నరసింహులు, కురు ఆంజనేయులు, లక్ష్మీరెడ్డి, కెకె జగన్, కచర్ల హరీష్, అశోక్, కమ్మవారిపల్లి నగేష్, నరేష్, కొత్తిమీర వెంకటేష్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మండల అధ్యక్షులు

# మంత్రి చొరవతో బత్తలపల్లి చెరువుకు చేరుతున్న పీఏబీఆర్ నీరు

బత్తలపల్లి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త



చెరువులోకి చేరుతున్న నీటిని పరిశీలిస్తున్న నాయకులు

పీఏబీఆర్ కుడి కాలువ నుండి మండల కేంద్రమైన బత్తలపల్లి చెరువు, తాడిమర్రి మండ లంలోని నారసిం హపల్లి చెరువులకు పీఏబీఆర్ నీరు చేరు తోంది. గురువారం మధ్యాహ్నం బత్తల పల్లి చెరువులోకి నీరు వస్తుండడంతో నీటి ప్రవాహాన్ని బత్తలపల్లి క్లస్టర్ ఇంచార్జ్ నెట్టెం రమణ, గడుపూటి రామానాయుడు, ఇరిగేషన్ అధికారులు, బిజెపి మండల అధ్యక్షులు ఆకులేటి భాస్కర్,మాజీ మండల కన్వీనర్ వీరనారప్ప,కావేటి మల్లికార్జున, వడ్డే తిరుపతయ్య,లింగారెడ్డిపల్లి బొంతల ఉజ్జినప్ప,ముసుగు రామచంద్ర,సాకే గోపాల్ కొండ,ఆకులేటి తరుణ్ కుమార్ తదితరులు పరిశీలించారు.గత రెండు రోజుల క్రితం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు బిజెపి నాయకులతో కలిసి మంత్రి కార్యాలయ సిబ్బంది హరీష్ బాబు ధర్మవరం బ్రాంచ్ కెనాల్ వద్ద గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే.రెండు రోజుల క్రితం గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయగా గురువారం మధ్యాహ్నం బత్తలపల్లి నారసింహపల్లి చెరువులకు పిఏబిఆర్ నీరు రాక ప్రారంభమైంది. చెరువులలో ఉన్న పెద్ద పెద్ద గుంతలు నిండి చెరువు నిండాలంటే ఇదే ప్రవాహం కొనసాగితే దాదాపు పది రోజులకు చెరువులకు ఆశించిన నీరు చేరుతుందని రైతులు పేర్కొన్నారు. పీఏబీఆర్ నీటితో బత్తలపల్లి చెరువు నింపితే తాగునీటి ఇక్కట్లు తప్పుతాయని,బోరుబావులలో భూగర్భ జలాలు పెరిగి పంటల సాగుకు అనుకూలంగా ఉంటుందన్నారు.మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక చొరవతో చెరువులకు నీరు వస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

# వాహనాలు జాగ్రత్తగా నడపాలి...!

## వాహన చట్టాలపై అవగాహన పెంచుకోవాలి...!



రోడ్డుభద్రతా నియమాలగురించి అవగాహనకల్పిస్తున్న టూటౌన్ సీఐ రెడ్డప్ప

ధర్మవరం, ఫిబ్రవరి 6,ప్రభాతవార్త

వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని టూటౌన్ సీఐ రెడ్డప్ప విద్యా ర్థులకు సూచిం చారు. రేగాటిపల్లి రోడ్డులోని వివేకా నంద డిగ్రీ కళాశాలలో జరిగిన జాతీయ రహదారి భద్రతా మాసోత్స వాలలోభాగంగా కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించిన అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా టూ టౌన్ సీఐ రెడ్డప్ప మాట్లాడుతూ....18 సంవత్సరా లు నిండిన ప్రతి ఒక్కరు లైసెన్స్కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. లైసెన్స్ లేకుంటే వాహనాలు నడపరాదన్నారు. అలా నడిపితే చట్ట ప్రకారం శిక్షార్హులున్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ హర్షవర్ధన్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం గుడ్స మారిటన్ పేరిట అవార్డులను తీసుకువచిందన్నారు ప్రమాద బాధితులకు సహాయం చేసే వారికి కేంద్రందా్వారా రూ.500 రివార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జ్ రమేశ్, అద్యాపకులు కృష్ణయ్య, హరీశ్, శ్రీనివాజులు, శిరీష, పాల్గొన్నారు.

# పదవ తరగతి వసతి గృహ విద్యార్థులకు ప్రేరణ మరియు శిక్షణ తరగతులు

## విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులు ప్రధానం

కొత్తచెరువు ఫిబ్రవరి 6 ప్రభాతవార్త.



వసతి గృహ పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ మరియు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీ సత్య సాయి జిల్లా ప్రభుత్వ బాలుర వసతి గృహము పుట్టపర్తి సహాయ సాంఘిక సంక్షే మ పరిధిలోని చెన్నె కొత్తపల్లి, తాడిమర్రి ధర్మ వరం , పుట్టపర్తి వసతి గృహాలకు చెందిన విద్యా ర్థిని విద్యార్థులకు గురువారం 10 గంటల నుంచి సాయం త్రం 5 గంటల వరకు పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణ మరియు శిక్షణ తరగతులు పుట్టపర్తి సహాయ సాంఘిక సంక్షేమ అధికారి శ్రీరాములు ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ మరియు సాధికారత అధికారి శివరంగ ప్రసాద్ విచ్చేశారు శిక్షణ తరగతులు అనంతరం విద్యార్థులకు వారి సబ్జెక్టులు సంబంధించి క్విజ్ ప్రోగ్రాం నిర్వహించారు అందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు పుట్టపర్తి బాలుర వసతి గృహము విద్యార్థులు కలసి ప్రథమ బహుమతి 1000 రూపాయలు అందజేశారు అలాగే ద్వితీయ బహుమతి విజేతలైన చెన్నే కొత్తపల్లి బాలికల వసతి గృహ విద్యార్థులందరికీ కలిసి బహుమతిగా 500 రూపాయలు అందజేశారు మార్చిలో జరగబోయే పదవ తరగతి పబ్లిక్ వసతి గృహ విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థుల్లో ఉన్న భయం వీడి స్వేచ్ఛగా పరీక్షలు ఎలా రాయాలి తదితర అంశాలపై విద్యార్థులకు ప్రేరణ కల్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో పుట్టపర్తి సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శ్రీరాములు సత్య సాయి సేవా ట్రస్ట్ సభ్యులు ,పాఠశాల ఉపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్స్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం.

# అడవికి నిప్పు పర్యావరణానికి ముప్పు

తాడిమర్రి, ఫిబ్రవరి 6 (ప్రభాతవార్త)



పర్యావరణ పరిరక్షణ గురించి అవగాహన కల్పిస్తున్న అధికారులు

మండల పరిధిలోని ప్రభుత్వ అటవీ ప్రాంతమైన చిల్లవారిపల్లి దాడి తోట గ్రామాల నందు అడవులను కాపాడుకునే విధం గా అలాగే పర్యా వరణా పరిరక్షణకై గ్రామాల్లోని రైతుల కు ప్రజలకు గొర్రెల కాపరులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలోని భాగంగా అడవిలోకి అగ్ని చొచ్చుకొని పోకుండా అడవికి తోటలకు మధ్యన అగ్ని చొచ్చుకొని వెళ్లకుండా ఉండేందుకు మధ్యన ఉన్న చెత్తను ఎండిన కొమ్మలను మొదలైన వాటిని తొలగించి ప్రభుత్వ అటవీ ప్రాంతాలను కాపాడే విధంగా అలాగే అడవులలో నివసిస్తున్న జంతువులకు పక్షులకు ఎటువంటి ఇబ్బంది ప్రాణహాని లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కే హుస్సేన్ అప్ప ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సి సూర్యనారాయణ తెలియజేయడం జరిగింది ఈ సదస్సులో ముఖ్యంగా రైతులు చేస్తున్నటువంటి చిన్నపాటి తప్పులు వల్ల అటవీ ప్రాంతాలు కాళీ బూడిద అవుతున్నాయని మూగజీవులు పక్షులు ఎన్నో చనిపోతున్నాయని అటువంటి తప్పులు జరగకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు తెలియజేయడం జరిగింది.

# ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భవతులకు అన్నదానం

కణేకల్లు, ఫిబ్రవరి 06 ప్రభాతవార్త:



అన్నదానం చేస్తున్న అధికారులు

మాల మహా నాడు రాష్ట్ర ఉపా ధ్యక్షులు రామాంజినేయులు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన గర్భవతులకు గురువారం అన్న వితరణ కార్య క్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పణికుమార్, ఎస్సై చేతుల మీదుగా ప్రారంభించారు. మండలంలోని దూర గ్రామాల నుండి వచ్చిన గర్భవతులకు బోజన సదుపాయం కల్పించినందుకు ఎంతో ఊరట కలిగిస్తుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన గర్భవతులకు పరిసర ప్రాంతాల్లో రుచికరమైన హోటళ్లు లేనందున ఇబ్బంది కరంగా ఉండేదని, గురువారం మాలమహానాడు ఆధ్వర్యంలో గర్భవతులకు భోజన సదుపాయాలు కల్పించినందుకు ఈ లోటు తీరింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ నిరీష, ఆశా వర్కర్లు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్ల నాణత్యను తనిఖీ చేసిన క్వాలిటీ కంట్రోల్ అధికారులు

## -ఉరవకొండ, నెరమెట్ల, లత్తవరం, లత్తవరం తండాల్లో నమూనాల సేకరణ

ఉరవకొండ, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త



సీసీ రోడ్డును నాణ్యత పరీక్షలు నిర్వహిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఉరవకొండ పట్టణంతోపాటు మండల పరిధి లోని నెరమెట్ల, లత్తవరం, లత్తవరం తండా గ్రామాల్లో ఇటీవలి కాలంలో నూత నంగా నిర్మించిన సిమెంటు రోడ్ల నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ అధికారులు గురువారం తనిఖీ చేశారు. క్వాలిటీ కంట్రోల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవీంద్ర పట్టణంలోని పంచాయతీ కార్మికుల కాలనీ, మాస్టర్ సీవీవీ నగర్, రైస్ గోదాము ప్రాంతంలో ఒక్కొక్కటీ 5 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన రోడ్లతోపాటు నెరమెట్ల గ్రామంలో 14 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన 4 రోడ్లు, లత్తవరంలో 10 లక్షల రూపాయల వ్యయంతో, లత్తవరంతండాలో 4 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన రెండు రోడ్లను తనిఖీ చేశారు. యంత్రాలతో రోడ్ల నమూనాలను ల్యాబ్ పరీక్షల నిమిత్తం సేకరించారు. ఈ కార్యక్రమంలో మండల ఇంజనీర్ రవీంద్ర స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో జగద్గురు మధ్వాచార్యుల అవతార సమాప్తి దినోత్సవం

## -మంత్రాలయ రాఘవేంద్రస్వామి శాఖా మఠంలో పల్లకీ ఉత్సవం, ప్రత్యేక పూజలు

ఉరవకొండ, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త



ప్రత్యేకాలంకరణలో రాఘవేంద్రస్వామి బృందావనం దృశ్యం



పల్లకీ ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ద్వైత వేదాంతాన్ని బోధించిన జగద్గురు మధ్వాచార్యుల అవతార సమాప్తి దినోత్స వం స్వస్తిశ్రీ క్రోదినామ సంవత్స రం మాఘ మాసం శుద్ధ నవమి గురువారం భక్తిశ్రద్ధలతో జరిగింది. పట్టణంలోని మంత్రాలయ రాఘవేంద్రస్వామి శాఖా మఠంలో ఉదయం మధ్వాచార్యుల చిత్రపటానికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. రాఘవేంద్రస్వామి బృందావనానికి ఉదయం ఫల పంచామృతాభిషేకం, అష్టోత్తర పారాయణం, పల్లకీసేవ నిర్వహించారు. మధ్వాచార్యులు పూర్ణప్రజ్ఞ, ఆనందతీర్థ అని పిలువబడిన హిందూమతాన్ని ఉద్ధరించిన త్రిమతాచార్యులలో మూడవవారు. సమకాలీన హిందూ మతం సిద్ధాంతవేత్త అయిన ఆయన సా.శ.1238-1317 మధ్య కాలంలో జీవించారని చెబుతారు. ఆయన హనుమంతుడు, భీముడు వాయు దేవునకు తృతీయ అవతారమని నమ్ముతారు. మఠంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# ఘనంగా జకనీమాత ఉత్సవాలు



మహిళలు పూర్ణకుంభంతో ర్యాలీ చేస్తున్న దృశ్యం

గుత్తి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

అరె కటికల ఆరా ధ్యదైవం శ్రీసునామ జకనీమాత ఉత్స వాలు గురువారం ఘనంగా ప్రారంభమ య్యాయి. దేశంలోనే ఏకైక దేవస్థానం గుత్తిలో వెలసింది. ఉత్స వాలను పురస్క రించుకుని సునామ జకనీమాత, మల్కుమా జకనీమాతల అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూర్ణాహుతి, మహా మంగళహారతి, తదితర పూజలు గావించారు. అమ్మవారి ఉత్స వ విగ్రహాలను కన్యలు ముత్తైదువులు పూర్ణకుంభాలతో సాయిబాబా దేవస్థానం నుండి మాత ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. భక్తులతో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, తదితర రాష్ట్రాల నుండి పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు. భోజనం వసతి సౌకర్యాలను దేవస్థానం కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు మల్కారి లక్ష్మణరావు, ఆలయ ధర్మకర్త సురేష్రావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మోసం చేసిన వ్యక్తిని తహసిల్దార్ ముందు బైండోవర్

అగళి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

మండల పరిధిలోని ఇరిగేపల్లి గ్రామంలో గంగమ్మకు చెందిన మంగళ సూత్రాన్ని మెరుగు పేరుతో తీసుకొని బీహార్ యువకుడు దీపక్ కుమార్ సాహూ 10 గ్రాముల బంగారాన్ని కాజేయడంతో పోలీసులు గురువారం తహసిల్దార్ సుబ్బారావు ముందు బైండోవర్ చేశారు. గతంలో చేసిన పొరపాటును మళ్లీ చేయబోనని మండల మెజిస్ట్రేట్ ఎదుట ఒప్పుకున్న తర్వాత సొంత పూచికత్తుపై విడుదల చేసినట్లు పోలీసులు తెలిపారు.

# రైలు కింద పడి వృద్ధుడు మృతి

కొత్తచెరువు ఫిబ్రవరి0 6 ప్రభాతవార్త

మండల పరిధిలో ని నాగిరెడ్డిపల్లి రైల్వే బ్రిడ్జి సమీపంలో బుధవారం రాత్రి కొత్తచెరువు గ్రామానికి చెందిన బోయ రంగప్ప (60) రైలు క్రింద పడి మృతి చెందాడు. ఈయన బేల్దారి పనిచేసుకొని కుటుంబాన్ని పోషించుకునేవాడు. పనులు లేకపోవడంతో అప్పులు అధికమై ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక జీవితంపై విరక్తి చెంది రైలు కిందపడి మృతి చెందినట్లు తెలిసింది. ఈ విషయం రైల్వే పోలీసులు కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని హిందూపురం కు తరలించి పోస్టుమార్టం నిమిత్తం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈయనకు భార్య కొడుకు కూతురు ఉన్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# మధ్యాహ్న భోజన పథకంపై సామాజిక తనిఖీ



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న దృశ్యం

గుడిబండ ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:

మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల, మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజన పథకం నిర్వహణ,సర్వశిక్షా అభియాన్ పథకాలలో జరిగిన పనులను సామాజిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజన పథకాన్ని అమలు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు.అలాగే మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం తదితర సౌకర్యాలను మెరుగుపరచాలని పాఠశాల సిబ్బందికి సూచించారు.ఈ తనిఖీల్లో డిఆర్పీ లు లక్ష్మణ్, ప్రసాద్ పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారుల మానవత్వం

## -ప్రమాదంలో గాయపడిన ఆశ కార్యకర్త కూతురికి ఆర్థిక సహాయం

విడపనకల్లు ఫిబ్రవరి 06 ప్రభాత వార్త :

మానవత్వం అంటే ఏమిటో మరోసారి రుజువుచేశారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది. బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆశ కార్యకర్త కుమార్తెకు వైద్యాధికారి డాక్టర్ రాజేంద్ర, వైద్య సిబ్బంది ఆర్థిక సాయం అందించి గొప్ప ఉదాహరణగా నిలిచారు. ఆశ కార్యకర్త జ్యోతి కుమార్తె యాహ్వి జన్య ఇటీవల బైక్ ప్రమాదానికి గురైంది. ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో తక్షణమే కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి తీవ్రతను గుర్తించి శస్త్రచికిత్స చేశారు. ఈ ప్రమాదంలో పాప తలకు 42 కుట్లు పడ్డాయి. ఈ విషయం తెలిసిన వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాజేంద్ర, సిబ్బంది స్పందించారు. ఆసుపత్రి ఖర్చులకు తోడ్పడేందుకు వారు జ్యోతి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. వైద్య సేవలతో పాటు మానవీయ హృదయాన్ని చాటిచెప్పిన డాక్టర్ రాజేంద్ర, సిబ్బంది తీరునూ అందరూ ప్రశంసిస్తున్నారు. డాక్టర్ రాజేంద్ర మాట్లాడుతూ ఆశ కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తారు. ఇటువంటి సందర్భాల్లో వారి కుటుంబ సభ్యులకు కూడా మనం తోడుగా నిలవాలి ఈ సహాయం మా చిన్న ప్రయత్నం" అని వివరించారు. ఆయనతో పాటు, నర్సులు మరియు ఇతర సిబ్బంది సభ్యులు కూడా యాహ్వి జన్య త్వరితగతిన కోలుకోవాలని కాంక్షించారు. వైద్య వృత్తి కేవలం చికిత్సలకే పరిమితం కాకుండా, సహాయ హస్తాన్ని అందించడంలోనూ ఉన్నతంగా నిలబడేలా డాక్టర్ రాజేంద్ర చేసిన ఈ చర్య, మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొంటున్నారు. తల్లిదండ్రులు జ్యోతి, అశోక్ కుమార్ స్పందిస్తూ తమ కుమార్తెకు అందించిన సహాయానికి వైద్యాధికారి డాక్టర్ రాజేంద్రకు, వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

# నేడు మండలాధ్యక్షుడి ఎంపిక

రామగిరి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

రామగిరి మండల అధ్యక్షుడి ఎంపిక శుక్రవారం చేపట్టనున్నట్లు ఎంపిడిఓ చంద్రమౌళి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిపిగా ఉన్న మీనిగ నాగమ్మ అనారోగ్యంతో డిసెంబర్ ఆఖరున మృతి చెందింది. ఆమె మృతితో సీఈఓ ఆదేశాల మేరకు మండల ఉపాధ్యక్షుడిగా ఉన్న కర్రెన్నను మండల అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. శుక్రవారం ఉదయం 11:30 గంటలకు అధ్యక్షుడు బాధ్యతలు స్వీకరిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపిటిసిలు, కోఆప్షన్ మెంబర్లు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, పంచాయితీ కార్యదర్శిలు తప్పక హాజరు కావాలని ఆయన తెలిపారు.

# ఉన్నత పాఠశాలకు ఆర్థిక సహాయం



విశ్రాంత ఉపాధ్యాయుడు రాజన్న

బెలుగుప్ప, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విశ్రాంత ఉపాధ్యాయుడు, పూర్వ విద్యార్థి రూ.ఒవేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వెంకట ప్రసాద్ మాట్లాడుతూ.. బడి రుణం తీర్చుకో అనే పదాన్ని విశ్రాంత ఉపాధ్యాయుడు రాజన్న సార్థకం చేశాడని, ఆ ఉపాధ్యాయున్ని ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# త్రాగునీటి బోరుకు మరమ్మత్తులు చేయించిన సర్పంచ్



బోరును మరమ్మత్తు చేస్తున్న దృశ్యం

మడకశిర ఫిబ్రవరి 06 ప్రభాతవార్త:

మడకశిర మండలం గౌడనహల్లి పంచాయతీ జమ్మానిపల్లి గ్రామాలలోని త్రాగునీటి బోరు ఇనుప పైపులు చిలుము పట్టి పైపు లీకేజీ అయ్యి అధిక మొత్తంలో నీరు వృథా అవుతున్న విషయాన్ని గ్రామస్తులు సర్పంచ్ కు తెలియజేయడం తో వెంటనే స్పందించిన సర్పంచ్ భర్త హనుమంతేగౌడ్ బోరును మరమ్మత్తులు చేయించి పాడైన పైపులు తొలగించి నూతన పైపులు అమర్చి సమస్య ను పరిష్కరించి తురకవాండ్లపల్లి గ్రామంలోని త్రాగునీటి బోరు సమస్యను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# హనుబీమామద్వ దేవస్థానంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో హనుమ బీమాంజినేయ మూలవిరాట్

రామగిరి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

మండల పరిధిలోని పేరూరు గ్రామంలో వెలసిన హనుబీమా మధ్వాంజనేయస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘమాసం మధ్వనవమి సందర్భంగా దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. మూల విరాట్ ఆంజినేయస్వామి, భీముడు, మద్వాచార్యులు ముగ్గురు కలిపిన అవతారంలో ఆంజినేయస్వామి వెలసి ఉన్నారు. ప్రతి ఏడాది మద్వనవమి రోజును ప్రత్యేక పూజలు నిర్వహించనున్నటుట్ల ఆలయ అర్చకులు రామకృష్ణ స్వామి తెలిపారు. కాగా విశేష పూజల్లో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.


# నేడు కందులు కొనుగోలు కేంద్రం ప్రారంభం

## - హాజరు కానున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

మండల కేంద్రమైన రామగిరిలో ప్రభుత్వం ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించనున్నారు. రాప్తాడు ఎ మ్మెల్యే పరిటాల సునీత చేతుల మీదుగా ఉదయం 11 గంటలకు రామగిరిలోని వ్యవసాయ శాఖ కార్యాలయ ఆవరణంలో ఈ కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు టిడిపి మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతి ప్రసాద్, తెలుగు యువత అధ్యక్షులు శ్రీధర్నాయుడు తెలిపారు. ఈకార్యక్రమానికి రైతులు, టిడిపినాయకులు,కార్యకర్తలుహాజరు కావాలన్నారు.

# పోలేపల్లి సచివాలయం ఆకస్మిక తనిఖీ



సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపిడిఓ

రామగిరి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

మండల పరిధిలోని పోలేపల్లిగ్రామ సచివాలయాన్ని ఎంపిడిఓ చంద్రమౌళి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన సచివాలయానికి వెళ్లి సిబ్బంది హాజరు శాతాన్ని పరిశీలించారు. పెండింగ్లో ఉన్న సర్వేలన్నింటిని సచివాలయ సిబ్బందికి సమానంగా ఇచ్చి గురువారం సాయంత్రంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎప్పుడు అప్పచెప్పిన పనిని పూర్తిచేయాలన్నారు. ఇక నుంచి ఆలస్యం చేస్తేచర్యలు తప్పని హెచ్చరించారు.

# దరఖాస్తు చేసుకోవడానికి గడువు పెంపు

అగళి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

ఓబిఎంఎంఎస్ ద్వారా సబ్సిడి రుణాలకు దరఖాస్తు చేసుకోవడానికి 12వ తేది వరకు గడువు పెంచినట్లు ఎంపిడిఓ యాదవేంద్ర తెలిపారు. 7వ తేది చివరితేదిగా ఉండగా, దానిని 12కుమార్చినట్లు తెలిపారు. బిసి, కాపు, ఓసి, ఓబిసి సబ్సిడిరుణాలకు దరఖాస్తుచేసుకోవడానికి గడువుపెంచినట్లు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన లక్ష్మన్న కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి..

## సిఐటియు జిల్లా సభ్యులు కోరి నాగరాజు

కణేకల్లు, ఫిబ్రవరి 06 ప్రభాతవార్త:

సత్యసాయి వాటర్ సప్లై సంస్థలో సూపర్వైజర్గా పనిచేస్తున్న లక్ష్మన్న బుధవారం రోడ్డు ప్రమాదంలో మరణించడం చాలా బాధాకరమని, దురదృష్టకరమని సిఐటియు జిల్లా కమిటి సభ్యులు కోరి నాగరాజు ప్రగాడ సానుభూతి తెలియజేశారు. గురువారం సిఐటియు నాయకులతో కలిసి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన లక్ష్మన్న మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం సిఐటియు మండల కార్యదర్శి కోరి నాగరాజు మాట్లాడుతూ లక్ష్మన్న మృతికి సిఐటియు ప్రగాడ సంతాపాన్ని తెలియజేస్తోందని, మరణించిన లక్ష్మన్నకుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, అదే విధంగా తక్షణ సహాయం క్రింద రూ.25లక్షలు ఎక్స్గేషియాను అందించాలని, మరణించిన లక్ష్మన్న కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు కాకిడి శర్మ తదితరులు పాల్గొన్నారు.

